

కళత్తూరు ముంపు బాధితులకు వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - కెవిబిపురం

కే వి బి పురం మండలంలోని కళత్తూరు ముంపు బాధితులకు రోటరీ క్లబ్ తిరుపతి, వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతి వారు దాతల సహాయార్థంతో 55 కుటుంబాలకు వంట పాత్రలను శనివారం పంపిణీ చేశారు. దాదాపు లక్షన్నర రూపాయల విలువ చేసే వంట పాత్రలను కెవిబిపురం జడ్‌పి హైస్కూల్లో బాధితులకు ఇచ్చినట్లు ట్రస్టు కార్యదర్శి మల్లారపు నాగార్జున, రోటరీక్లబ్ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బాలోత్సవం నాయకులు నడ్డినారాయణ, డాక్టర్ టి.రవీంద్రకుమార్ తెలిపారు. నవంబర్ ఆరో తేదీ కట్టతెగి సర్వస్వం కోల్పోయిన బాధిత దళితులకు తమ వంతు ఉడతాభక్తిగా సాయం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, నాయకులు నాగలాపురం నాగరాజు పాల్గొన్నారు.

అత్యాధునిక సూపర్‌స్పెషాలిటి వైద్యమే లక్ష్యం

'స్విమ్స్‌ను ఐఎన్ఐ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) పరిధిలోకి తీసుకొస్తే ఏటా రూ.1000 కోట్లను కేంద్రం వెచ్చిస్తుంది.. స్వయం ప్రతిపత్తి కల్పిస్తుంది.. ఇందుకు పార్లమెంట్‌లో చర్చించి, అనుమతి ఇవ్వాలి.. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు చేస్తున్నాం.. ఇది కార్యరూపం దాల్చితే అత్యాధునిక సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా రోగులకు అందుబాటులోకి తీసుకురావచ్చు.. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.. స్విమ్స్ ఆస్పత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి..' అని డైరెక్టర్, స్విమ్స్ యూనివర్సిటీ సంచాలకులు డాక్టర్ రావినూతన వెంకట కుమార్ (ఆర్‌వి కుమార్) అన్నారు. 30 సంవత్సరాల చరిత్ర కలిగిన స్విమ్స్‌లో తాజాగా జరుగుతున్న అభివృద్ధిపై 'ప్రజాశక్తి'కి వివరించారు. (ప్రజాశక్తి - తిరుపతి సిటీ)

ఐఎన్ఐ పరిధిలోకి వస్తే రూ.1000 కోట్లు నిధులు

ప్రజాశక్తి : స్విమ్స్‌కు టిటిడి ఎంత నిధులను కేటాయిస్తోంది..?

ఆర్వీ కుమార్ : యాభై పడకలతో ప్రారంభమైన ఆస్పత్రి ప్రస్తుతం 1500 పడకల సామర్థ్యానికి విస్తరించింది. కరోనా తరువాత స్విమ్స్ ప్రతిష్ట కొంత తగ్గుమొహం పట్టింది. దశాబ్దకాలంగా వైద్యులు, సిబ్బంది, నర్సులు, వైద్యేతర సిబ్బంది కొత్త నియామకాలు లేవు. పెరిగిన రోగులకు తగ్గట్లు భవనాలు అందుబాటులో లేవు. ఆర్థికలోటు, ఉన్న యంత్రాలు పాతబడటం వల్ల స్విమ్స్ ప్రతిష్ట కొంత దిగజారిన మాట వాస్తవమే. 2023లో నేను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న తపనతో కార్యాచరణ రూపొందించి ముందుకెళుతున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రత్యామ్నాయంతో ముందుకెళుతున్నాం. స్విమ్స్‌ను టిటిడి పరిధిలోకి తీసుకురావడం సంతోషకరం. టిటిడి ఆధ్యాత్మిక సంస్థ. తన పరిధి మేరకు మొదటినుంచి స్విమ్స్‌కు సాయం చేస్తూనే ఉంది. టిటిడికి అనుబంధంగా మారిన తరువాత నిధుల శాతాన్ని పెంచింది. గతంలో ఏడాదికి 60 కోట్లు కేటాయిస్తుంటే, ప్రస్తుతం 130 కోట్ల నిధులు ఏడాదికి అందుతున్నాయి. మరో 12 కోట్ల నిధులు ప్రాణదానం పథకం కింద అదనంగా అందజేస్తోంది.

ప్రజాశక్తి : ఖాళీలను భర్తీ చేసే ఉద్దేశ్యం ఉందా..?

ఆర్వీ కుమార్ : టిటిడి సహకారంతో ఇటీవల కొత్త నియామకాలు చేపట్టాం. 106 మంది వైద్యులను నియమించుకునేందుకు అనుమతి వచ్చింది. నోటిఫికేషన్ విడుదల చేశాం. అయితే నియామకాలపై గందరగోళ పరిస్థితి రావడంతో 106 పోస్టులకు 70 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అందులో స్క్రూట్నీ అనంతరం 50 మంది ఎంపికయ్యారు. కొత్తగా నర్సులు, పారామెడికల్ సిబ్బంది రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. మరో నెల రోజుల్లో 236 కొత్త పోస్టులు భర్తీ చేయనున్నాం. స్విమ్స్ నుంచి ఏడాదికి రూ.230 కోట్లు ఆదాయం వస్తోంది. అందులో ప్రధానంగా ఆరోగ్యశ్రీ నిధులే ఎక్కువ. ఆరోగ్యశ్రీకి 10 సంవత్సరాల క్రితం పెట్టిన ప్యాకేజీలు అమలు అవుతుండడంతో పెరిగిన ధరలకు, వ్యయానికి తగ్గ ఆదాయం రావడం లేదు.అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళుతున్నాం.

ప్రజాశక్తి : రోగ నిర్ధారణకు యంత్రాలు ఉన్నాయా?

ఆర్వీ కుమార్ : టిటిడి ఇచ్చిన నిధులతో కొత్తగా ఎంఆర్ స్కాన్ యంత్రం, సిటి సిబిలేటర్, క్యాన్సర్ లైనేక్, పెట్ స్కాన్ వంటి అధునాతన యంత్రాలను కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చాం. 2026 జనవరికల్లా ఎస్పిఎంసి ఆసుపత్రి వద్ద నిర్మిస్తున్న కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. ఆర్థిక ఇబ్బందులను అధికమించేందుకు దాతల సహకారాన్ని కోరాం. పలువురు సమ్మతించి దాతత్వాన్ని చాటుకుంటున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా రూ.25 కోట్లు, రిలయన్స్ సంస్థ ద్వారా రూ.15 కోట్లు, హెచ్ఎల్ రూ.1.55 కోట్లు, యూనియన్ బ్యాంక్ ద్వారా రూ.50 లక్షల సహాయం అందడంతో వాటిని రోగులకు అవసరమైన పరికరాల కొనుగోలుకు వినియోగిస్తున్నాం. ఇప్పటి వరకు టిటిడి నుంచి స్విమ్స్‌కు 450 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి 40 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 కోట్ల రూపాయలు సహకారం అందడంతో మందులు, వైద్య పరికరాలు, యూనివర్శిటికి అవసరమైన వసతులు కల్పనకు వెచ్చించాము. కోవిడ్ తర్వాత ధరలు విపరీతంగా పెరగడం, వంటి వాటి వల్ల ఆర్థిక ఇబ్బంది కూడా తప్పడం లేదు. ప్రత్యామ్నాయ విధానాల కోసం అన్వేషణ చేస్తున్నాం.

ప్రజాశక్తి : మీ స్పెషలైజేషన్ ఏంటి?

ఆర్వీ కుమార్ : గత 30 ఏళ్లుగా వైద్యవృత్తిలో కొనసాగుతున్నాను. అంతర్జాతీయ స్థాయిలో బైపాస్ సర్జరీ, గుండెమార్పిడి, పిల్లల గుండె శస్త్ర చికిత్సలలో అనుభవం ఉంది. అసిస్టెంట్, అసోసియేట్, అడిషనల్, కార్డియోథొరసిక్ ప్రొఫెసర్గా, ఉస్మానియాలో 11 సంవత్సరాలు హెచ్ఓడిగా, 10వేలకు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు చేశాను. తెలంగాణలోని ప్రభుత్వ రంగ ఆసుపత్రిలో మొట్టమొదటి గుండె మార్పిడి శస్త్రచికిత్స చేశాను. పిల్లల గుండె జబ్బులపై తెలుగులో పదిలం పదిలం పసి హృదయం, ఆంగ్లంలో టైనీ టాట్స్ అండ్ టెండర్ హార్ట్స్ పుస్తకాలు ప్రచురించాం.. క్రియాశీల సామాజిక సేవలకు గుర్తుగా వైద్యరత్న, వైద్య శిరోమణి, ప్రొఫెసర్ జయశంకర్ మెమోరియల్ అవార్డు, అబ్దుల్ కలాం అవార్డు సుశ్రుత పురస్కారం, లెజెండ్ ఆఫ్ ట్రాన్స్ ప్లాంటేషన్ అందుకున్నాను. స్విమ్స్ డైరెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటి ట్రిపుల్ (గుండె, కాలేయం, మూత్రపిండాలు) అవయవ మార్పిడి చేసిన ఘనత స్విమ్స్ కు తీసుకొచ్చాను. ఎయిమ్స్ లో కూడా ఇలాంటివి జరగలేదు. సేవా దృక్పథంతోనే వైద్యవృత్తిలోకి రావాలి.



'ప్రజాశక్తి'తో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

రాజ్యాధికారాన్ని సాధించుకుందాం

ప్రజాశక్తి - కోట

'రాజ్యాంగాన్ని రక్షించుకుని.. రాజ్యాధికారాన్ని సాధించుకుందాం' అంటూ వక్తలు ఉద్ఘాటించారు. కోట మండలంలో పంచాయతీ కార్యాలయం వద్ద బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీసూరు మాధవ్ ఆధ్వర్యంలో బహిరంగసభ ఆదివారం జరిగింది. మాజీ ఐఎఎస్ విజయ్‌కుమార్, రాష్ట్ర మాల ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు అశోక్‌బాబు, కేంద్ర మాజీ మంత్రివర్యులు చింతామోహన్, రాష్ట్ర మాల గెజిటెడ్ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రచయిత రేంజర్ల రాజేష్, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు దాసరి సుందరం పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా హక్కులను కల్పించడం జరిగిందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పోరాట త్యాగ ఫలితాలను అనుభవిస్తున్న మనం రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం ఐక్యతను పాటించాలన్నారు. జేఏసి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ రాష్ట్రస్థాయిబహిరంగసభను మొట్టమొదటగా కోటలో నిర్వహించామన్నారు. రాజ్యాధికారాన్ని సాధించుకుంటేనే రాజ్యాంగానికి మనుగడ అన్నారు.

విశాఖ సిఇఎంఎస్‌తో తిరుపతి ఐఐటి ఎంఓయు

ప్రజాశక్తి-ఏర్పేడు

విశాఖపట్నంలోని ప్రముఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్) తో తిరుపతి ఐఐటి ఎంఓయు చేసుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, సిఇఎంఎస్ సంస్థ సీఈవో గోపికష్ణ శివమ్ సంతకాలు చేశారు. ఈ సంస్థలు పరిశ్రమ, అకాడేమియా సహకారాన్ని బలోపేతం చేయడానికి అధునాతన మాన్యుఫాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ 4.0 సాంకేతిక పరిజ్ఞానాలలో అత్యాధునిక శిక్షణ, నైపుణ్య కార్యక్రమాలను సంయుక్తంగా అభివద్ధి చేయడం, అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐఐటి డీన్ అరుణ్ తంగిరాల, డా.సాయి కష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, డా. సబ్యసాచి మజుందార్ పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్‌లో 'చెకుముకి' సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు ఘనంగా జరిగాయని నాయకులు రెడ్డెప్ప, రఫీ తెలిపారు. మండల స్థాయిలో విజేతలైన 54 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 3డి షో, ప్లాంటోరియంను సందర్శించారు. జిల్లాస్థాయి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి సంబరాలు డిసెంబర్ 21 నుంచి 23 వరకూ కాకినాడ జెన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతాయి. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న 162 మంది విద్యార్థులకు మెమెంటో, మూడు సైన్స్ పుస్తకాలను బహూకరించారు. ముఖ్య అతిథులుగా స్విమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ వనజాక్షమ్మ, సైన్స్ ఎంటర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పురుషోత్తం, రిటైర్డ్ ప్రొఫెసర్ చలపతి, మణికంఠ, యుటిఎఫ్ నాయులు ఎస్ఎస్ నాయుడు, మధు, కిరణ్ స్కూల్ అధినేత జయరామిరెడ్డి, బాలోత్సవం నాయకులు దామోదరం, గురునాధం, ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌బాబు పాల్గొన్నారు.

తిరుపతిలో ఫ్రెష్ టు ఫ్రెష్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి మధ్యతరగతి కుటుంబాలకు గిట్టుబాటు ధరలను అందించడమే తమ లక్ష్యమని ఫ్రెష్ టు ఫ్రెష్ డీలర్ భరత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైరాగి పట్టణంలోని రెండవ సూపర్ మార్కెట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్ మార్కెట్ వ్యవస్థాపకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూలై 12న ఎంఆర్ పల్లి సర్కిల్లో ప్రథమ సూపర్ మార్కెట్ ప్రారంభించామని తెలిపారు. తిరుపతిలో తమ సూపర్ మార్కెట్ ను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని వారికి సౌకర్యార్థం రెండో షోరూమ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి ప్రజలకు చేరువలో మరో మూడో బ్రాంచ్ డిసెంబర్ నెలలో కరకంబాడి రోడ్డులోని తిమ్మినాడు పాలెం వద్ద అతిపెద్ద సూపర్ మార్కెట్ను త్వరలో ప్రారంభించబోతున్నామని తెలియజేశారు.

తిరుపతిలో కిక్ బంక్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్మార్ట్ సిటీ గా అభివద్ధి చెందుతున్న తిరుపతిలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన కిక్ బంక్ రెస్టారెంట్ ను నగరంలోని పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ అధినేతలు అనిల్ రెడ్డి, దినేష్, మోహన్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో నూతన అంగులతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా కిక్ బంక్ ను ఏర్పాటు చేశామన్నారు. ఏసీ, నాన్ ఏసీ హాల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికి వీలుగా బర్త్‌డే వేడుకలు, గెట్‌టుగెదర్ పార్టీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం, జెడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బాలాజీ' రైల్వే డివిజన్‌పై 'పట్టు'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి బాలాజీ జిల్లా రైల్వే డివిజన్ ఉద్యమం రోజురోజుకూ ఊపందుకుంటోంది.సాధన సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండే ఎంఎల్ఎలను, ఎంపిలను, డిప్యూటీ సిఎంను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. బాలాజీ రైల్వే డివిజన్ అవసరం గురించి వివరించారు. అవసరమైతే 'బంద్'కు సైతం వెనుకాడబోమనేలా సాధన సమితి కార్యాచరణ ఉంది.

తిరుపతి నగరంలో నాలుగు సార్లు మేధావులతో సమావేశం జరిగింది. రానున్న శీతాకాల పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ గురించి ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బాలాజీ డివిజన్ పై పార్లమెంట్లో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ఇటు అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తో పాటు, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కూడా అసెంబ్లీలో ప్రస్తావిస్తామని చెప్పారు. అలాగే శాసనమండలి సమావేశాల్లోనూ ప్రస్తావిస్తామని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. రైల్వే పరంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంతో వెనుకబడి ఉంది. గత పది సంవత్సరాల కాలంలో బడ్జెట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రైల్వే పరంగా కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అపారమైన వనరులు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సరిహద్దులుగా కర్నాటక, తమిళనాడు ఉన్నాయి. తూర్పున నెల్లూరు జిల్లాలో సముద్రం ఉండడంతో ఎంతో అనువుగా ఉంటుంది. తిరుపతి జిల్లాలో శ్రీసిటీలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి.

అవసరమైతే 'బంద్' సైతం

బాలాజీ రైల్వే డివిజన్ కోసం తిరుపతి ఎంపి ని కలిసిన కమిటీ నేతలు (ఫైల్)

వేలాదిమంది కార్మికులు తమిళనాడు, ఆంధ్రనుంచి వచ్చి పని చేస్తుంటారు. రేణిగుంటలో రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్‌లో దాదాపు 1500 పైగా మంది పని చేస్తారు. రేణిగుంటలో విమానాశ్రయం ఉంది. తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో రైల్వే స్టేషన్ పనులు జరుగుతున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ ఏడాదికి 250 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుస్తుంది. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్ ఏడాదికి 100 కోట్ల ఆదాయం రైల్వేకు వస్తోంది. తిరుపతితో పాటు చంద్రగిరి, రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రజలకు అందుబాటులో ఉండడం వీటిని వీటిని అభివద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాతీయ రహదారులు ఇరు రాష్ట్రాలకు అందుబాటులో ఉండడం ఓ వరం. తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడటం, తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతంగా ఉండడంతో ఇక్కడ యాత్రికుల సంఖ్య తాకిడి అధికంగానే ఉంటుంది. తిరుపతిలో రాయలసీమలో ఎక్కడా లేని విధంగా అనేక విద్య వైద్య కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండే నిరుద్యోగులు ఉపాధి కోసం కర్నాటక, తమిళనాడు వెళ్లి ఉద్యోగాలు చేస్తుంటారు.

బాలాజీ డివిజన్తో ఉపయోగాలు

తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మేధావులు అంటున్నారు. ప్రతి ఏడాది రైల్వే బడ్జెట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అన్యాయం జరుగుతుంది. బాలాజీ రైల్వే డివిజన్ ఉంటే బడ్జెట్లో అనేక ప్రాజెక్టులు మంజూరు చేస్తారు. కొత్త రైళ్లు, కొత్త రైల్వే ట్రాకులు, విద్యుద్దీకరణ పనులు, రైల్వే ఆసుపత్రులు, విద్యాలయాలు వంటి ప్రాజెక్టులు మంజూరు అయితే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టుల వల్ల అనేకమంది ఉద్యోగాలు లభిస్తే వారు ఇక్కడ నివాసం ఉండడమే కాకుండా వారి పిల్లలు కూడా ఇక్కడే చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. డివిజన్ ఏర్పడడంతో ప్రయాణికులు సంఖ్య పెరగడమే కాకుండా రైల్వే ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి. డివిజన్ ఉండడం వల్ల ఇటు చిత్తూరు జిల్లాతో పాటు అటు కడప, నెల్లూరు జిల్లా, అనంతపురం జిల్లా, ఇటు తమిళనాడు అటు కర్ణాటక లో నివసించే తెలుగు వాళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో బాలాజీ డివిజన్ పై ప్రశ్నించే అవకాశం ఉంది. డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో పలువురు ఎంపీలను, కేంద్ర మంత్రులను బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో కలవనున్నారు. అవసరమైతే తిరుపతి బంద్ నిర్వహిస్తామని మేధావులు అంటున్నారు

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై పద్మావతి దేవి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అమ్మవారు సూర్యప్రభ, చంద్ర ప్రభ వాహనాల పై ఊరేగారు. అశ్వాలు, వషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు సూర్యప్రభ వాహనసేవ సాగింది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఈ వాహనసేవల్లో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

పంచమీ తీర్థానికి పటిష్ట ఏర్పాట్లు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన నవంబరు 25వ తేదీ మంగళవారం జరగనున్న పంచమీ తీర్థానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టిటిడి పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. పంచమీ తీర్థం నిర్వహణకు అవసరమైన క్యూలైన్లు, బారికేడ్లు, పద్మపుష్కరిణిలోనికి ప్రవేశ, నిష్క్రమణ గేట్లు, సూచిక బోర్డులు తదితర ఇంజినీరింగ్ పనులు పూర్తయ్యాయి.

భద్రతా ఏర్పాట్లు

తిరుచానూరుకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టిటిడి భద్రత, నిఘా విభాగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా టిటిడి భద్రతా సిబ్బంది 600 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ 200, ఎన్.సి.సి.విద్యార్థులు 200, శ్రీవారి సేవకులు 900, పోలీస్ సిబ్బంది 1600 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

అన్నప్రసాదం కౌంటర్లు

భక్తుల సౌకర్యార్థం దాదాపు 150 అన్నప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. తోళ్ళప్ప గార్డన్స్‌లో 50, ఎస్వీ హైస్కూల్ వద్ద -15, శ్రీ అయప్పస్వామివారి (నవజీవన్ ఆసుపత్రి)ఆలయం వద్ద - 45, పూడి ఏరియాలో - 25., గేట్ - 4లో ఎమర్జెన్సీ - 15 అన్నప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేస్తారు. అదేవిధంగా క్యూలైన్లలోని భక్తులకు అవసరమైన తాగునీరు, అల్పాహారం, అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేస్తారు. పంచమి తీర్థంలో భక్తులకు సేవలందించేందుకు దాదాపు 900 మంది శ్రీవారి సేవకులు టిటిడిలోని వివిధ విభాగాలలో సేవలందిస్తారు.

ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం

పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పంచమీ తీర్థం కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందిస్తారు. పద్మపుష్కరిణిలో మధ్యాహ్నం 12.10 గంటలకు కుంభలగ్నంలో చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. పంచమీ తీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించి పుణ్యస్నానాలు ఆచరించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుంది.

రైతు బజారు లేక..రైతులు సతమతం

- నిధులు మంజూరైనా చేపట్టని పనులు - అన్ని మున్సిపాల్టీల్లోనూ ఇదే దుస్థితి - కూరగాయల దుకాణాలే దిక్కు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : పట్టణంలోని పుత్తూరు పాలిటీల్లో 1.30 వేల వరకు జనాభా ఉన్నారు. నిత్యం పుత్తూరు, నగరి పట్టణాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి మరో 40 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రైతు బజార్లు లేకపోవడంతో అటు రైతులు, ఇటు విని యోగ దారులు నష్టపోతున్నారు. కూరగాయల మార్కెట్లో దళారులదే పెత్తనంగా మారింది. ఈ పరిస్థితిని గమనించి దశాబ్దన్నర క్రితమే టిడిపి ప్రభుత్వం పట్టణాల్లో రైతు బజార్లు ప్రారంభించింది. అయితే గత ప్రభుత్వ హయాంలో రైతు బజార్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా.. నిధులు విడుదల చేయక పోవడంతో వినియోగా నికి దూరమయ్యాయి.

నిధులు మంజూరైనా చేపట్టని పనులు

గతంలో టిడిపి హయాంలో రెవెన్యూ డివి జన్ కేంద్రాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు పుత్తూరు, నగరి, తిరుపతిలో ఏర్పాటు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి హయాంలో మున్సిపాలిటీల్లో నూ ఏర్పాటు చేయాలని తలచారు. ఈ మేరకు స్థలాలు గుర్తిం చారు. అనంతరం 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. వారు సైతం మున్సిపాలిటీల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తామని, నిధులు మంజూరు చేస్తా మన్నారు. ఐదేళ్లు గడిచాయి. అంతిమంగా రైతులు, విని యోగా దారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పనులు ముందుకు సాగలేదు

పుత్తూరు పురపాలికల్లో మార్కెట్ కమిటీ యార్డులో రైతు బజారు నిర్మాణానికి స్థలం కూడా కేటాయించారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ముందుకు సాగలేదు. వైసిపి ప్రభుత్వం అని మార్కెట్ కమిటీలు సైతం ఆర్థికంగా చితికిపోయాయి.

చౌక ధరలకు లభించే అవకాశం

రైతు బజార్లు ఏర్పాటు చేయడం వల్ల కూరగాయలు చౌక ధరలకు లభించే అవకాశం వుంది. దీనికి తోడు పట్టణాల్లో ఏర్పాటు చేయడం వల్ల సమీప మండలాల్లోని రైతులకు, వినియోగదారులకు లాభం చేకూరుతుంది.
- సురేంద్ర, పుత్తూరు.

పెంచలకోన ఆలయ అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి ఆనం, ఎమ్మెల్యే రామకృష్ణ

భూమి పూజ చేస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: పెంచలకోన ఆలయ ప్రాంగణంలో రూ.6.50 కోట్ల నిధులతో శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణతో కలిసి మంత్రి ఆనం రామ నారాయ ణరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారు లు మంత్రి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఘన స్వాగతం పలికారు. పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారిని దర్శించుకుని మంత్రి ఆనం ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ భక్తులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వం ధ్యేయం అన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో పెంచలకోన క్షేత్రం వేగంగా అభివృద్ధి చెందు తోందన్నారు. ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మా ణానికి రూ.6.50 కోట్లు మంజూరై శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు. పెంచలకోనకు డబుల్ రోడ్డు కోసం అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని మంత్రిని ప్రత్యేకంగా కోరామని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ రూ.6.50 కోట్ల అంచనాతో ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి వెంకటగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోరిక మేరకు అనేక ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరలో ధ్యాన మంది రానికి శంకుస్థాపన చేసి నిధులిచ్చామని తెలిపారు. బాలాయపల్లి మండలంలో యాచవరం ఆలయానికి నిధులిచ్చామని పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 141 ఆలయాలకు ఒక్కొక్క ఆలయానికి ప్రతినెలా పదివేలు ధూపదీప నైవేద్యాలకు అంది స్తున్నామని, సిజిఎఫ్ఎస్ ద్వారా 58 ఆలయాల అభివృద్ధి పనులకు 118.45 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సిబ్బంది మానవత్వం

- గాయపడ్డ వృద్ధురాలికి వైద్యం
- ఆమె కుమారుడి వద్దకు చేర్చిన వైనం

గాయపడి నడవలేని స్థితిలో వున్న వృద్ధురాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు డిపో ఆర్‌టిసి సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. తీవ్రంగా గాయపడి పైకి లేవలేక బస్టాండు ఆవరణలో పడివున్న ఓ వృద్ధురాలిని రక్షించి మరొకరి సాయంతో ఆమె సొంత ఊరికి పంపి తమ ఉదారతను చాటుకోవడం పట్ల పలువురు ప్రశంసించారు. రెండు రోజుల క్రితం తీవ్ర గాయాలతో బాధపడుతూ పైకి లేవలేని స్థితిలో ఉన్న గుర్తు తెలియని ఓ వృద్ధురాలిని ఆర్‌టిసి డిపో మేనేజర్ మహేంద్ర గమనించారు. వెంటనే అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మతో కలిసి ఆమెకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి ప్రాథమిక చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. కాలు విరిగి ఎముక బయటకు కనిపించేలా గాయపడిన ఆమెకు అత్యవసర వైద్య సాయం చేయడంతో పాటు, ఆమె వివరాలు తెలుసుకునేందుకు ఫొటోలను వివిధ వాట్సాప్ గ్రూప్‌లలో పంపించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌టిసి విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ బాబు ప్రత్యేకంగా విచారణ జరిపి, ఆమె తమిళనాడులోని కంచి సమీప గ్రామానికి చెందిన వృద్ధురా లని గుర్తించారు. తర్వాత వేద వ్యాస విద్యాసంస్థల అధినేత బాల సరస్వతి మానవతా దృక్పథం తో ముందుకు వచ్చి, స్వంతంగా వాహనం పంపించి ఆ వృద్ధురాలిని ఆమె స్వగృహమైన కంచికి చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. వృద్ధురాలి కుమారుడు వేలూరు వద్దకు చేరుకున్న తన తల్లిని ఆదుకున్న ఆర్‌టిసి డిపో మేనేజర్ మహేంద్రకు, బాల సరస్వతికి, సహకరించిన సిబ్బందికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న వృద్ధురాలికి వెంటనే స్పందించి అండగా నిలిచిన ఆర్‌టిసి సిబ్బంది మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పలువురు ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రతిఒక్కరూ సమాజ సేవ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయా లన్నారు. పద్మావతినగరంలో శ్రీ సత్య సాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.చక్రవర్తి, జాయింట్ కన్వీనర్ బి.మురళి పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాతత్పరతను అలవరుచుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మానవాళికి సేవ చేయడమే భగవంతుని సేవ' అనే నమ్మకాన్ని సత్యసాయి బాబా ప్రచారం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ హసీమ్, డి.ఈ.రాజు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

రమణ మహర్షి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: పుత్తూరు త్రినేత్ర పిరమిడ్ ధ్యానమందిరంలో ఆదివారం పలమనేరు నుండి వచ్చిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆలూరు బాలాజీ, రమణ మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడు నెలల పాటు శ్రమించి ఈ పవిత్ర విగ్రహాన్ని తీర్చి దిద్దిన యోగా మాస్టర్ సుబ్రహ్మణ్యం సేవను అందరూ అభినందించారు. ఆలూరు బాలాజీ మా ట్లాడుతూ ధ్యానం మనసుకు ఔషధం వంటిదని నిజమైన ఆరోగ్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. మానసిక ఆందోళనలు అనేక శారీరక రుగ్మతలకు కారణమవుతున్నాయని రోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయిస్తే ఆరోగ్యం, ప్రశాంతత, స్పష్టత పెరుగుతాయని సూచించారు. పుత్తూరులోని త్రినేత్ర పిరమిడ్ ధ్యానకేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో త్రినేత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ క్వారీల అనుమతులు రద్దు చేయండి: సిపిఎం

ప్రజాశక్తి- కెవిబిపురం: కెవిబిపురం మండలం ఎగువపూడి నివాస ప్రాంతాలకు దగ్గరగా అక్రమంగా క్వారీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాడు క్వారీ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా నివాస ప్రాంతాలకు అతి దగ్గరగా యంత్రాలను దించ డంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు దిగడంతో యంత్రాలు వెనక్కి వెళ్లాయని జనార్ధన్ తెలిపారు. యాజమాన్యం గ్రామస్తుల అభిప్రాయాలకు భిన్నంగా క్వారీ నడపాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. తక్షణమే అక్రమంగా మంజూరు చేసిన క్వారీ అనుమ తులను అధికారులు రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. లేకుంటే క్వారీ యాజమాన్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి: సిఐటియు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండు చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు వెంకటగిరి మండల జనరల్ బాడీ సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్ లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, జిల్లా అధ్యక్షులు ఫైజీరియాలు ప్రసంగించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని , సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్ సంస్థలకు పథకాన్ని అప్పగించకూడదని, మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించేసిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలకు ప్రదర్శన బహిరంగ సభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ వెంకటగిరి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా ఏ మంజుల, అధ్యక్షులుగా ఎస్ రోజా రమణి, ఉపాధ్యక్షులుగా ఎం నాగభూషణమ్మ, ప్రధాన కార్యదర్శిగా భవాని, జాయింట్ సెక్రెటరీగా నాగభూషణమ్మ, కోశాధికారిగా సుగుణమ్మ, కమిటీ సభ్యులుగా కుమారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోటాపోటీగా హాకీ క్రీడలు

ప్రజాశక్తి -చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల చంద్రగిరిలో ఆదివారం రెండవ రోజు నిర్వహించిన14 సంవత్సరాల లోపు బాల బాలికల స్కూల్ గేమ్స్ హాకీ పోటీలలో 15 మ్యాచ్‌లు బాలురకి, 15 వ1మ్యాచ్‌లు బాలికలకు నిర్వహించారు. లీగ్ పోటీలు నాలుగు గ్రూపులుగా విభజించారు. లీగ్ పోటీలలో గ్రూప్ విన్నర్స్, రన్నర్స్‌లో బాలురు జట్లు ఎనిమిది, బాలికల జట్లు ఎనిమిది నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బాలురు ఫలితాలు ఇలా వున్నాయి. మొదటి క్వార్టర్ ఫైనల్‌లో విశాఖపట్నం బాలురు జట్టు పశ్చిమగోదావరి జిల్లా మ్యాచ్ జరగగా 4 /3 స్కోర్ తో విశాఖ జట్టు గెలుపొందింది. బాలుర రెండవ క్వార్టర్ ఫైనల్‌లో కర్నూలు జట్టుపై తూర్పుగోదావరి జట్టు 4/0 స్కోర్‌తో గెలుపొందింది. బాలుర మూడవ క్వార్టర్ ఫైనల్స్ లో కడప జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై ఐదు సున్నా గోల్స్ తేడాతో గెలుపొంది సెమీఫైనల్స్‌కు ప్రవేశించింది. నాలుగవ బాలుర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జిల్లా జట్టు శ్రీకాకుళం జిల్లా జట్టుపై రెండు ఒకటి గోల్స్ స్కోర్ తేడాతో గెలిచి సెమి ఫైనల్స్ కి ప్రవేశించింది. బాలికల మ్యాచ్‌లలో నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ ఫలితాలు బాలికల మొదటి క్వార్టర్ ఫైనల్స్ లో గుంటూరు జట్టుపై విశాఖపట్నం జట్టు ఒకటి సున్నా తేడాతో గెలుపొందింది. రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జట్టు ఎనిమిది సున్నా స్కోర్ తేడాతో గెలుపొందింది. బాలికల మూడవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కడప జట్టు నెల్లూరు జట్టుపై తొమ్మిది సున్నా గోల్స్ తేడాతో గెలిచి సెమీఫైనల్స్ కు చేరుకుంది. బాలికల నాల్గవ క్వార్టర్ ఫైనల్స్‌లో అనంతపురం జట్టు కర్నూలు జట్టుపై 7 0 గోల్స్ స్కోర్‌తో విజయం సాధించి సెమీఫైనల్స్‌కి ప్రవేశించింది. రేపు నిర్వహించే సెమీఫైనల్స్ మ్యాచ్‌లు వివరాలు.. బాలుర జట్లు విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి జిల్లా జట్ల మధ్య మొదటి సెమీ ఫైనల్, వైఎస్ఆర్ కడప, అనంతపురం బాలుర జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ జరగనుంది. బాలికల జట్లలో సెమీఫైనల్ కి ప్రవేశించిన జట్లు వివరాలు.. మొదటి బాలికల సెమీఫైనల్ వైయస్సార్ కడప, విశాఖపట్నం జట్ల మధ్య , రెండవ సెమీఫైనల్ తూర్పుగోదావరి, అనంతపురం జిల్లా జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్ భార్గవి దేవి అబ్జర్వర్ థామస్ ఆర్కే సెలవపాండెనే , మాజీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి టీ కేశవయ్య, హరికృష్ణ కిరణ్ కుమారు, ప్రభాకరు, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఆచారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోర్సులు మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరుబాలాజీ నగర్ లోని ప్రగతి కార్యాలయంలో యాళ్ల రమేష్ నాయుడు జన్మదినం సందర్భంగా వారి కుమారులు మోహన్ చౌదరి, వేణు చౌదరి సహాయ సహకారాలతో 50 మందికి దుప్పట్లు , వెజిటేబుల్ బిరియాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ చలికాలంలో నీరు పేదలకు ఉపయోగపడే విధంగా ఒక మంచి కార్యక్రమాన్ని ఈరోజు ప్రగతి సేవా సంస్థ ద్వారా యాళ్ల రమేష్ నాయుడు కుమారులు మోహన్ ,వేణు నిర్వహిస్తున్నారని వారికి భగవంతుని ఆశీస్సులతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహనాయుడు, అమరయ్య నాయుడు, గోకుల్ రెడ్డి, వెంకట్ పవన్ , జస్వంత్, ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మో హనరావు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐటిఐ ప్రభాకర్, మెడనూరు సురేష్ రెడ్డి, కేఆర్ఎం, తూపిలి యశ్వంత్, శ్రీహరి,డిష్ నాగరాజు, కృష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర పాల్గొన్నారు.

సద్గురు మలయాళ స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడులోని చెక్ పోస్ట్ సమీపంలో సద్గురు మలయాళ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వ్యాసాశ్రమంలో చదివిన పూర్వ విద్యార్థులు కలిసి మండపాన్ని ఏర్పాటు చేసి ఘనంగా విగ్రహ ప్రతిష్టను ఆదివారం ఉదయం నిర్వహించారు.

మహారాజ శ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
O.S.No. 67/2025
Mudduluru Srinivasulu @ Srinivasa Raju ...Plaintiff
Vs
Devaki Badri Venkata Narayana Gupta ...Defendant
To
Devaki Badri Venkata Narayana Gupta, S/o Ramalingaiah, Flat No.104, R.K. Residency, East Gudur, Gudur town and Mandal, Tirupati District.
పై నెంబరులోని వాది తన ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు కొనుటకు గాను దావా దాఖలు చేసినందున ప్రతివాది నోటీసుకు గాను తేది 08-12-2025న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
ఇట్లు
రఘురామిరెడ్డి,
వాది తరపు న్యాయవాది, గూడూరు

పాఠశాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రధానోపాధ్యాయులు పద్మావతి ఆధ్వర్యంలో అల్యుని ఆంధ్ర అసోసియేషన్ న్యూయార్క్ వారి ఆర్థిక సహకారంతో ఎంఈఏ రవీంద్రనాథ్ పిల్లల సౌకర్యార్థం నిర్మాణాన్ని చేశారు. మండలం లోని పల్లమాల ప్రాథమిక పాఠశాలలో పిల్లల సౌకర్యార్థం డైనింగ్ హాలు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మాణ దాత, గ్రామస్తులు మోహన మాట్లాడుతూ చదువుకున్న గ్రామ పాఠశాల అభివృద్ధికి అసోసియేషన్ ద్వారా తమ వంతు కృషి చేయాలని సంకల్పంతో ఇది చేయడం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనూరాధ, వెంకటేశ్వరరావు, విజయభారతి, గ్రామస్తులు సురేష్, తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ ప్రమీల పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరులో పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం ఉదయం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మెడికల్ క్యాంప్‌లో కాటూరు, చుట్టుపక్కల పల్లెల నుంచి పాల్గొని వంద మంది పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి నెలకు సరిపోను ఉచిత మందులు అందించారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ లక్ష్మీనారాయణ , డాక్టర్ రాజేష్, డాక్టర్ భవ్య , సభ్యులు షాకిర్యాలీ, గుమ్మల రాజేశ్వరరావు, జిఎంఆర్ సుబ్రహ్మణ్యం, మోహన్, రాజేష్, నరసింహులు, షఫీ, శేషు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణలో
ఎగువగూరూ ముందంజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్కె రోజా ఇచ్చిన పిలుపు మేరకు పుత్తూరు మండలం తడుకు పంచాయతీకి చెందిన ఎగువ గూళూరులో కోటి సంతకాల కార్యక్రమం కొనసాగింది. వైసిపి సీనియర్ నాయకుడు గూళూరు కరుణ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఆదివారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల రూరల్ కన్వీనర్ అన్నా లోకనాథం, కొండేటి రామ్మూర్తి, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ వై గంగాధరం, ఎగువ గూళూరులో నిర్వహించే కోటి సంతకాల కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంతో కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్ర మంలో గూళూరు కరుణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మీద రెండు సంవత్సరాలు పూర్తి కాకముందే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య నీల కంఠం తులసిబాబు శివ, వెంకటేష్, దొరస్వామి, ముత్తుబాబు, నవీన్ కుమార్, రవిభాస్కర్, బిట్టిబాబు, జైకుమార్, పెరుమాళ్, అనూష్, జాలీ, కోకిల, పాపమ్మ, శ్యామల, మునెమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తకు జనసేన అండ

కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాగబాబు

ప్రజాశక్తి -చంద్రగిరి : చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన కార్యకర్తకు మొదటి సారిగా ప్రమాద బీమా చెక్కు అందించారు. లోకేష్ కుటుంబ సభ్యుల కోసం క్రియాశీలక వాలంటీర్ల హరి చేసిన కృషి, పట్టుదల, నిరంతర కృషి ఫలితంగానే ఈ సాయం అందిందని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవర మనోహర్ పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం, రాయలచెరువు పంచాయతీకి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు పెనుగొండ లోకేష్ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన లోకేష్ కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆయన సతీమణి యామినికి రూ. 5 లక్షల చెక్కును చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు నాగబాబు చేతుల మీదుగా అందించారు.

మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్‌లో నివాసముంటున్న మారం రెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆదివారం వాకాడ ఏఎంసి చైర్మన్ దారా ప్రమీల, ఎంపీటీసీ దారా సురేష్‌లు పరామర్శించారు. ఈ మేరకు మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి అనారోగ్యంతో ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా వారు శ్రీధర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఏర్పేడు: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని డాక్టరు ఎస్ రత్న శేఖర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ కుటుంబ బలోపేతం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలకు చెందిన పది గ్రామాల నుండి వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పదో తరగతి అనంతరం తీసుకోవాల్సిన కోర్సులు, అవకాశాలు, కెరీర్ పై రిసోర్స్ పర్సన్ ఎస్ రత్న శేఖర్ అవగాహన కల్పించారు. ఇంటర్ గ్రూపులు, పాలిటెక్నిక్, ఐటీఐ, వైద్యానుబంధ కోర్సులు, దీర్ఘకాలిక కెరీర్ ప్రణాళికపై విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. సత్యనారాయణ, సహా ద్యోగులు మునిరత్నం, వెంకటరమణ, ఆనమేటర్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కోట: గ్రామీణ ప్రాంతాల్లో యువత రక్తదానంపై ఉన్న అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వైసిపి నాయకులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం కోట మండలం చెందోడు గ్రామంలో స్వర్గీయ విద్యాప్రదాత ముప్పవరపు వెంకటేశ్వరరావు ముప్పవరపు ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం యంవి రావు ఫౌండేషన్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని దువ్వూరు శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. గూడూరు పట్టణానికి చెందిన మేడి పల్స్ రక్తనిధి కేంద్రం ద్వారా పలు ప్రాంతాల నుంచి వచ్చిన రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు.

మానసిక వికలాంగుల సేవే ఆనందం..

రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ ఆధవరం నాగూరయ్య

ప్రజాశక్తి-నాయుడుపేట: మానసిక పరిపక్వత లేని మానసిక వికలాంగులైన అభాగ్యులకు సేవచేసే అవకాశం రావడం గొప్ప అవకాశంగా భావిస్తు న్నానని ఈ కార్యక్రమంలో తమకు సహకరించిన డాక్టర్ నీలిమా ప్రియదర్శనికి కృతజ్ఞతలు తెలుపు తున్నానని నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ ఆధవరం నాగూరయ్య అన్నారు. నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆధవరం నాగూరయ్య ఆధ్వర్యంలో డాక్టర్ నీలిమ ప్రియదర్శిని పర్యవేక్షణలో ఆదివారం మొలకల పూడిలో ఉన్న మెహర మానసిక విక లాంగుల అనాథ ఆశ్రమంలో 50 మంది మాన సిక విక లాంగులకు వైద్య పరీక్షలూ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోటరీ కోస్టల్ జోన్ అసిస్టెంట్ గవర్నర్ వాసు గౌడ్ అనాథ ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య మాట్లాడుతూ మహర ఆశ్రమంలోని మానసిక పరిపక్వత, ఆరోగ్యంపై కనీస అవగాహన లేని ఇలాంటి అభాగ్యులకు తమ వంతు సేవగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ ఎంతో ఆనందంగా వుందన్నారు. సహకరించిన డాక్టర్ నీలిమా ప్రియదర్శనికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ నీలిమ మాట్లాడుతూ ఇలాంటి వారికి సేవ చేయటం తనకు ఎంతో సంతోషం ఇచ్చిందని మంచి అవకాశం కలిగించిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. ప్రస్తుతం ఇక్కడ వైద్య పరీక్షలు మాత్రమే చేస్తూ ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. ఇంకా పెద్ద సమస్యలు వుంటే తమ క్లినిక్ తీసుకెళ్లి పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పూర్తిగా నయమయ్యే వరకు వాళ్లకు అవసరమయ్యే అన్నీ ఖర్చు మొత్తం ఆసుపత్రి భరిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమంలో రోటరీ క్లబ్ వారికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తామని ఆమె పేర్కొన్నారు. రోటరీ కోస్టల్ జోన్ అసిస్టెంట్ గవర్నర్ వాసు గౌడ్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలిగినందుకు నాయుడుపేట రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ జోనల్ లోని మూడు జిల్లాల్లో నాయుడుపేట రోటరీ క్లబ్ నిత్యం పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేస్తున్నారని, మరింత కృషి చేసి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు వచ్చే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాయుడు పేట రోటరీ క్లబ్ సభ్యులను కొని యాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ బట్టా సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రామమోహన్, హరిబాబు, శంకర్ లాల్, కెవిప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టరు నీలిమను సన్మానిస్తున్న దృశ్యం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు నీలిమ

క్రైం న్యూస్

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి -బాలాయపల్లి: మండలం లోని చుట్టి గ్రామానికి చెందిన ఆవుల సుబ్బమ్మ (63) ఆదివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందింది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బమ్మ పశువుల పేడ ఎత్తి పేడ గిన్నెను చెరువు దగ్గర శుభ్రపరుస్తుండగా కాలు జారి చెరువులో పడింది. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ నారాయణలు సుబ్బమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షులు రాయి సత్య నారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడులు సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణం చేసిన వారిపై కమిషనరు భవానీప్రసాద్ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు ఆదివారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని సన్నిధివీధిలో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ నాలుగవ గేటు కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించారు. పురపాలక సంఘం కమిషనరు భవానీ ప్రసాద్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక సిబ్బంది ఈ నెల 19వ తేదీన ఆ అక్రమ నిర్మాణం తొలగించారు. అయితే అక్రమణదారులు రేకుల షెడ్డుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులను దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించారు. ఈ నేపథ్యంలో కమిషనరు భవానీప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ మహిళ, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గామిట్ట వీధికి చెందిన శివయ్య (47) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సొంత పనుల నిమిత్తం శనివారం నాయుడుపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి వస్తుండగా తొట్టంబేడు మండలం చిన్నసింగమాల సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీటీసీకి పితృవియోగం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బిన్ కండ్రిగ మండలం పెళ్లేటివారి కండ్రిగ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పామాంజి సుబ్రహ్మణ్యం నాయుడు తండ్రి పామాంజి పెద్ద గురుస్వామి నాయుడు ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి మండల ప్రెసిడెంట్ మావిళ్ళపల్లి సుధాకర్ నాయుడు తెలిపారు. గురుస్వామి నాయుడు దహన క్రియలు సోమవారం 9 నుండి 10 గంటలకు సమయంలో పిల్లేటి వారి కండ్రిగలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రజాశక్తి - క్యాంపస్ : పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి 12-30 గంటల వరకు కర్ణాటక సంగీత విధుషీమణి, వరల్డ్ రికార్డు హోల్డర్ డాక్టరు తాత గిరిజా శేషమాంబ భక్తి సంగీత కచేరి పలువురిని ఆకట్టుకుంది. 'సరసి రూహాసన ప్రియే అంబ ' అంటూ నాట రాగంలో కీర్తనతో కార్యక్రమం ప్రారంభించి, 'వచ్చెను అలమేలు మంగా, అరసినన్నుగాచిన అలమేలు మంగ నీ అభినవరూపం, తిరోతిరో జవరాల, ఘుమ్మని ఎడి శృతి..' అంటూ అన్న మా చార్య కీర్తనలు ఆల పించి రాధ సమేత కృష్ణ అంటూ భక్తి సంకీర్త ఆలపించి బ. ్ క ్ ్ల న ం ఆకట్టుకున్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, గూడూరు
O.S.NO.292/2024
Andhra Pradesh Grameena Bank, (E-Andhra Pragathi Grameena Bank), Main Branch, Gudur Rep. by its Branch Manager ...Plaintiff
VS
I. KONDURU KOTESWARA RAJU
2. KONDURU SURESH RAJU ...Defendants
To
1. KONDURU KOTESWARA RAJU, S/o. Krishnama Raju
2. KONDURU SURESH RAJU, S/o. Krishnama Raju
Both are residing at Gurramkonda Village, Ozili Mandal-524402, Tirupathi District
వాది అయిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (E-ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు), గూడూరు - మెయిన్ బ్రాంచ్ వారు రూ. 3,65,598.03/-లు బాకీ వసూలు నిమిత్తం మీ పై O.S.NO:292/2024 కేసు దాఖలా చేసి ఉన్నందున యిందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 18.12.2025 ఉదయం 10 గం. లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని, ఈ కోర్ట్ లో హాజరై వారితో మనవి చేసుకోవలసినది లేని యెడల, సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.
వాయిదా: 18.12.2025
డి.వెంకటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాది, గూడూరు
9866072082

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, గూడూరు
O.S.NO.408/2024
IDBI Bank, Gudur Branch Rep. by its Branch Manager ...Plaintiff
VS
1. M/s. Iswarya Silks & Furniture and Home Needs Rep by its Proprietor Shaik Jameela
2. Shaik Jameela ...Defendants
To
I. M/s. Iswarya Silks & Furniture and Home Needs Rep by its Proprietor Shaik Jameela W/o. Areef
2. Shaik Jameela, W/o. Shaik Areef
Hindu, aged about 46 Years, Residing at Door No. 1-3-123 EVR Palli, West Gudur Gudur Mandal, Tirupathi District - 524101
వాది అయిన IDBI బ్యాంకు, గూడూరు బ్రాంచ్ వారు రూ. Rs.8,70,220.44/- లు బాకీ వసూలు నిమిత్తం మీ పై O.S.NO:408/2024 కేసు దాఖలా చేసి ఉన్నందున యిందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 18.12.2025 ఉదయం 10 గం. లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని, ఈ కోర్ట్ లో హాజరై వారితో మనవి చేసుకోవలసినది లేని యెడల, సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.
వాయిదా: 18.12.2025
డి.వెంకటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాది, గూడూరు
9866072082